సాక్షి కర్నూలు

మంగళవారం ॥ 17 ॥ డిసెంబర్ ॥ 2024



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



అవసానదశలో అష్టకష్టాలు

విశ్రాంత ఉద్యోగుల గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఏ ఒక్క ఆర్థిక ప్రయోజనం చేకూర్చక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.01
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 90.402
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,941
అవుట్ ఫ్లో	: 6,154

న్యూస్‌రీల్

ట్రేడ్ లైసెన్స్‌పై నకిలీ వ్యక్తుల కాల్స్ నమ్మొద్దు

- కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): వ్యాపార వాణిజ్య దుకాణదారులకు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వస్తే నమ్మొద్దని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కొందరు దుకాణదారులకు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ట్రేడ్ లైసెన్సుకు సంబంధించి కొంత నగదు చెల్లిస్తే మిగతా డబ్బులు మాఫీ చేస్తామని చెబుతున్నారని, వారిని నమ్మి మోసపోవద్దన్నారు. దుకాణదారుడు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్సు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నగరపాలక సంస్థకు చెందిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు చెల్లించాలని సూచించారు. ఫేక్ కాల్స్ వస్తే నగరపాలక ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి (7680075621)కి సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, విద్యుత్ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని వినియోగదారులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు విద్యుత్ వాడకం అధికమవుతున్న తరుణంలో పొదుపుపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కోసం విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించాలని, వర్క్‌షాపులు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణప్రాంతాల్లో ఇంధన పొదుపు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చిరంజీవి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి కావాలి

కర్నూలు(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వీ రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం ఆయన తన చాంబర్ నుంచి జిల్లాలోని డీఈఈ, ఏఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.67 కోట్లతో మొత్తం 830 పనులు చేపట్టడం జరిగిందని, ఇప్పటి వరకు 578 పనులు (70 శాతం) పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 30 శాతం పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చేసిన పనులకు అనుగుణంగా బిల్లులు విడుదలవుతున్నాయని, ఇప్పటి వరకు రూ.25 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. జిల్లాలోని పాణ్యం సబ్ డివిజన్‌లో పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని, ఆలూరు, మంత్రాలయం సబ్ డివిజన్లలో పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పనుల పురోగతికి సంబంధించి రాష్ట్రంలో కర్నూలు జిల్లా 10వ స్థానంలో ఉందని, పనులను సకాలంలో పూర్తి చేసి మొదటి స్థానానికి చేరుకునేందుకు క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లందరూ సహకరించాలన్నారు.

బాల కార్మికులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

కర్నూలు (లీగల్): బాల కార్మికులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ 2024 ఫేస్4లో భాగంగా సోమవారం నగరంలో బాలకార్మికులను గుర్తించడానికి వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏసీఎల్ సాంబశివ, డీసీపీఓ శారద, మహిళా పోలీస్ ఎస్ఐ రమణ, పోలీసు, విద్యా శాఖ అధికారుల సహకారంతో పట్టణంలో రెండు బృందాలుగా వెళ్లి కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, వీఆర్ కాలనీ, బళ్లారి చౌరస్తా, ఆటోనగర్, ఉల్చాల రోడ్, సంతోష్ నగర్, చిల్డ్రన్స్ పార్కు, ఓల్డ్ కంట్రోల్ రూమ్, బుధవారపేట, 4వ టౌన్ ఏరియాలో తనిఖీలు చేశారు. బుధవారపేటలో ఒక బాల కార్మికున్ని గుర్తించి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు.

నిర్లక్ష్యం డంప్.. నిధులు వేస్ట్



నిర్వహణ లేక శిథిలం

ఈ చిత్రం ఆలూరు పట్టణం బళ్లారి రోడ్డులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం. రూ.4 లక్షల గ్రామ నిధులు వెచ్చించి ఈ కేంద్రాన్ని నిర్మించారు. కొన్నాళ్లు పొడి చెత్త, తడి చెత్త ద్వారా వర్మీకంపోస్టు ఎరువును తయారు చేశారు. ఆ తర్వాత నిర్వహణ లేక నిరుపయోగంగా మారి పరికరాలు తుప్పు పట్టాయి. షెడ్డు పైకప్పు కూలిపోయింది. ప్రజాధనం వృథా అయినా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ పక్కనే వేస్తున్నారు.

ఒక్కో షెడ్డుకు అయ్యే ఖర్చు	
కొలతలు (అడుగులు)	నిధులు (రూ.లక్షల్లో)
20x30	3.40
20x50	5
40x50	8
40x60	9.80



- లక్ష్యానికి దూరంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు
- 407 పంచాయతీల్లో దాదాపు రూ. 14 కోట్లతో షెడ్ల నిర్మాణం
- వర్మీ తయారు చేస్తున్నామని చెబుతున్నవి 248
- ఎక్కడా వర్మీ విక్రయించిన దాఖలాలు లేవు

కర్నూలు(అర్బన్): పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. రూ. కోట్లు చెత్త పాలవుతున్నా అడిగేనాథుడు కరువయ్యారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిరుపయోగంగా మారి చెత్త సేకరణ రిక్షాలు మూలన చేరాయి. అక్కడక్కడా అరకొరగా తయారైన వర్మీకంపోస్టు కొనేవారు లేక గుట్టలుగా పేరుకుపోతుంది. జిల్లాలో చెత్త నుంచి సంపదను సృష్టించడంలో చిత్తశుద్ధి కొరవడింది. దాదాపు రూ. 14 కోట్లతో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా 407 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 248 షెడ్లలో వర్మీ తయారు చేస్తున్నట్లు చెబుతున్నా.. ఇప్పటి వరకు ఎక్కడ కూడా తయారు చేసిన వర్మీని రైతులకు అమ్మిన దాఖలాలు లేవు. చెత్తతో నాణ్యమైన సేంద్రియ ఎరువులను తయారు చేసి పంచాయతీలకు ఆదాయాలను సమకూర్చుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ, కంపోస్టు తయారీపై నీలి నీడలు కమ్ముకున్నాయి. మెజార్టీ గ్రామ పంచాయతీల్లో షెడ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడం వల్ల ఆయా గ్రామాల్లోని వీధుల నుంచి సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, ఆరుబయట ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీని వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ఏటా రూ.50 లక్షల ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు ...

పలు గ్రామ పంచాయతీల్లో షెడ్లు పూర్తయినా కంపోస్టు ఉత్పత్తి కావడం లేదు. దీంతో ఏడాదికి ఆయా గ్రామ పంచాయతీలు దాదాపు రూ.50 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నాయి. ఒక్కో షెడ్‌లో రెండు తొట్లను ఏర్పాటు చేసినా, ఒక్కో తొట్టి నుంచి ప్రతి మూడు నెలలకు 400 కిలోల ప్రకారం 800 కిలోల వర్మీని తయారు చేయవచ్చు. ఈ లెక్కన ఒక కిలో వర్మీ రూ.8కి అమ్మినా.. 800 కిలోలకు రూ.6,400 వస్తుంది. ఈ ప్రకారం ఏడాదికి మూడు పర్యాయాలు అమ్మినా.. 19,200 ఆదాయం వస్తుంది. వర్మీ తయారు చేస్తున్న 248 గ్రామ పంచాయతీలకు లెక్క చూస్తే దాదాపు రూ.47.61 లక్షలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ఆదాయాన్ని గ్రామ పంచాయతీ సాధారణ నిధులకు జమ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించే అవకాశాలు ఉన్నాయి. అయితే పలు ప్రాంతాల్లో షెడ్లు పూర్తి కాకపోవడం, పూర్తయిన వాటిలో కంపోస్టు తయారు కాకపోవడం వల్ల ప్రత్యక్షంగా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీలు కోల్పోతున్నాయి.



కోడుమూరులో నిరుపయోగంగా చెత్త తరలింపు వాహనాలు



హొళగుంద మండలం మార్లమడికిలో పిల్లర్ల దశలోనే షెడ్ నిర్మాణం

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల వివరాలు	
మొత్తం గ్రామ పంచాయతీలు 484	షెడ్లు పూర్తయిన గ్రామ పంచాయతీలు 407
షెడ్ల పనులు ప్రారంభం కానివి 33	బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నవి 03
పిల్లర్ల దశలో.. 23	రూఫ్ లెవెల్‌లో.. 18

లోపించిన చిత్త శుద్ధి...

గ్రామ పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి చెత్త నుంచి సంపదను సృష్టించడంలో పాలకవర్గాలు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించినట్లు తెలుస్తోంది. పలు ప్రాంతాల్లో షెడ్లు పూర్తయినా, వర్మీ తయారు కావడం లేదు. కొన్ని చోట్ల షెడ్లకు వచ్చే తడి, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు, ఐరన్, ఇతర వ్యర్థాలను వేరు చేసి కంపోస్టు తయారీకి అవసరమైన వ్యర్థాలను వేరు చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేవలం పేడతో వర్మీ తయారు చేయాలని చూడడంతో అనుకున్న స్థాయిలో కంపోస్టు తయారు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా షెడ్లలో ఏర్పాటు చేసిన సిమెంట్ తొట్లు కూడా రెండు, మూడు అడుగుల ఎత్తు ఉండడంతో కూడా కంపోస్టు అనుకున్న నాణ్యతతో రావడం లేదని, తొట్ల ఎత్తు అడుగు ఉంటే చాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ రకమైన కారణాలతో పలు ప్రాంతాల్లో కొంత మేర కంపోస్టు తయారీ జరిగినా.. రైతులకు విక్రయించిన దాఖలాలు లేవు.

రూ. 6 లక్షలతో నిర్మించి వృథాగా మార్చారు

చిత్రంలో కనిపిస్తున్న చెత్త సంపద కేంద్రం మద్దికెర మండలం ఎడవలి గ్రామంలోనిది. రూ.6 లక్షలతో నిర్మించి గాలికొదిలేశారు. ఇంత వరకు కిలో కూడా వర్మీకంపోస్టు తయారు కాలేదు. మండలంలో 8 పంచాయతీలకు గాను 7 చెత్త సంపద కేంద్రాలు నిర్మించగా ఇటీవల మూడింటిని వర్మీకంపోస్ట్ తయారీకి సిద్ధం చేశారు. అయితే వర్మీకంపోస్టు ఎవరికీ విక్రయించాలనే అవగాహన లేక పోవడంతో సందిగ్ధంలో పడ్డారు. మిగతా నాలుగు షెడ్లు నిరుపయోగంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో రహదారులపై చెత్త పేరుకుపోతోంది.

వర్మీపై రైతులకు అవగాహన కల్పించాలి



గ్రామ పంచాయతీల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ల ద్వారా తయారు చేయనున్న వర్మీ కంపోస్టు ఎరువు పట్ల రైతులకు అవగాహన కల్పించాలి. ఫర్టిలైజర్లు, పెస్టిసైడ్స్ వాడకం కంటే వర్మీ నాణ్యతగా ఉంటుంది. పైగా ధర కూడా తక్కువగా ఉండటం వల్ల రైతులకు ఆర్థికంగా కలిసొచ్చే అవకాశం ఉంటుంది. అసంపూర్తిగా ఉన్న షెడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి వర్మీ ఉత్పత్తులు, అమ్మకాలను ప్రారంభించాలి.

– అంపయ్య, దేవనకొండ

అన్ని కేంద్రాలు పనిచేసేలా చర్యలు



జిల్లాలోని అన్ని సంపద సృష్టి కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇందుకు సంబంధించి డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేశాం. షెడ్ల మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించుకునే అవకాశాలు ఉన్నాయి. పైగా వర్మీ ఉపయోగం వల్ల కలిగే లాభాలను రైతులకు అవగాహన కల్పించాలి. ఈ షెడ్ల నిర్మాణాలు, వర్మీ తయారీపై జిల్లా కలెక్టర్ కూడా ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రెగ్యులర్‌గా మానిటర్ చేస్తున్నాం.

– జీ భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి, కర్నూలు

నకిలీ పట్టాలకు పన్ను కట్టి మోసాలు చేస్తున్నారు

- అక్రమాలకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోండి
- కలెక్టర్ రజింత్ బాషాకు ఫిర్యాదు చేసిన 46వ వార్డు కార్పొరేటర్



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న 46వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని మామిదాలపాడు, మునగాలపాడు పరిధిలో ఉన్న శ్రీప్రియా నగర్‌లోని ఖాళీ ప్లాట్లకు కొందరు డూప్లికేట్ పట్టాలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని కలెక్టర్ రంజిత్‌బాషాకు కర్నూలు నగర 46వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. గతంలో తమ తండ్రి ఎస్. సుబ్రమణ్యం వేసిన వెంచర్‌లో ఖాళీగా ఉన్న 22వ ప్లాటుకు బోయ గిడ్డయ్య అనే వ్యక్తి నకిలీ పట్టా సృష్టించి దాని ద్వారా కార్పొరేషన్‌లో పన్ను చెల్లించి ఇంటి నంబర్ పొంది దానిని 2024 మే 20వ తేదీన ఇతరులకు విక్రయించారనే ఆధారాలను ఆయన కలెక్టర్‌కు సమర్పించారు. ప్రైవేట్ డీటీసీపీ లేవుట్లలోని ఖాళీ స్థలాలకు పట్టాలు ఎలా ఇస్తారని, ఈ విషయాన్ని గమనించకుండా కొందరు అధికారులు లంచాలు తీసుకుని పన్ను కట్టించుకొని అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్, జేసీ డాక్టర్ బి.నవ్య స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పత్తికొండ ఆర్‌డీఓకు సంబంధించి 6, పత్తికొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేకు సంబంధించి 4, కర్నూలు ఆర్‌డీఓకు సంబంధించి 3, డీపీఓకు సంబంధించి 2 అర్జీలు రీఓపెన్ అయినట్లు చెప్పారు. అలాగే సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి 7 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి త్వరగా పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. కాగా, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతులు, అర్జీదారులు కూర్చోవడానికి తిగిన ఏర్పాట్లు చేయాలని డీఆర్వో వెంకటనారాయణమ్మను ఆదేశించారు.

అర్జీలు రాసేందుకు డిజిటల్ అసిస్టెంట్లను నియమించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నిరక్షరాస్యులైన రైతులు ఎక్కువగా వస్తుండడంతో వారికి అర్జీలు రాసి ఇవ్వడానికి డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ముగిసిన తరువాత కలెక్టర్ కలెక్టరేట్ పరిసరాల్లో పర్యటించారు. కలెక్టరేట్ ముఖద్వారం వద్ద దివ్యాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు చేయించాలని సూచించారు. అర్జీలను సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సీనియర్ డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించి త్వరగా రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలంలో సులభ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

డీఐజీ, ఎస్పీని కలిసిన చెన్నకేశవరెడ్డి

కర్నూలు: ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సోమవారం డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందు మాధవ్‌తో భేటీ అయ్యారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పార్లపల్లెలో సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న సీసీఎస్ సీఐ ఇబ్రహీం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పట్ల ప్రవర్తించిన తీరు, అగౌరవపరుస్తూ దుర్భాషలాడిన వైనంపై ప్రజల్లో నిరసన వెల్లువెత్తింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీ అధికారుల సూచన మేరకు సోమవారం ఆయన కర్నూలుకు వచ్చి డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందు మాధవ్‌ను వారి కార్యాలయాల్లో కలసి చర్చించారు. 'నీవు ఓటరు కాదు కదా.. అక్కడికి ఎందుకు వెళ్లావ్... అని పోలీసు అధికారులు ప్రశ్నించగా.. రెండు సంఘాల్లో కూడా తాను ఓటరుగా ఉన్నానంటూ వివరించగా అందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించాలని పోలీసు అధికారులు కోరినట్లు చెన్నకేశవరెడ్డి కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జగన్‌మోహన్‌రెడ్డి 'సాక్షి'కి వెల్లడించారు. పార్లపల్లె సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనపై డీఎస్పీతో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వణికిస్తున్న చలి

- రోజురోజుకు పెరుగుతున్న చలి ప్రభావం
- ఆలూరులో అత్యల్పంగా 12.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



జాతీయ రహదారిని కమ్మేసిన పొగ మంచు


కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. నాలుగైదు రోజులుగా చలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాయంత్రం 6 గంటలకే చలిగాలుల కారణంగా ముసుగేయాల్సి వస్తోంది. ఉదయం 8 గంటలకు కూడా చలి వదలడం లేదు. ఈ ఏడాది జిల్లాలో అధికంగా వర్షాలు పడటంతో చెరువులు, కుంటలు, కాల్వల్లో నీరు ఉండిపోయింది. నీటి నిల్వలు ఎక్కువగా ఉండటంతో చలి తీవ్రత పెరుగుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు అత్యల్పస్థాయికి పడిపోతున్నాయి. ఆలూరు అత్యల్పంగా 12.8 డిగ్రీలు మాత్రమే ఉష్ణోగ్రత నమోదైంది. హాలహర్విలో 14.1, తుగ్గలిలో 14.3, గూడూరులో 14.4, చిప్పగిరిలో 14.6, దేవనకొండలో 14.6, మద్దికెరలో 14.6, ఆదోనిలో 14.7, కల్లూరులో 14.9, ఓర్వకల్‌లో 15.2, ఎమ్మిగనూరులో 15.2, పత్తికొండలో 15.2, పెద్దకడుబూరులో 15.4, వెల్దుర్తిలో 15.4 డిగ్రీల ప్రకారం రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి ప్రభావం వల్ల అలర్జీ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా 28 డిగ్రీల వరకే నమోదు అవుతున్నాయి. కమ్ముకున్న పొగమంచు ఉదయం 8 గంటలైనా వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జనవరి నెలలో చలి తీవ్రత ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 10 నుంచి 8 డిగ్రీలకు పడిపోతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. చలి ప్రభావం వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పడిపోయింది. ఇళ్లలో కనీసం ఫ్యాన్‌లు కూడా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

రూ. 100 కోట్లు రాలేదు

- జిల్లాకు రెండు నెలలుగా నిలిచిన చెల్లింపులు
- సీఎఫ్ఎంఎస్‌లో వెళ్లిన బిల్లులన్నీ ఆర్‌బీఐలో పెండింగ్
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ప్రభుత్వం దగ్గర డబ్బులు లేనప్పుడు ట్రెజరీలకు వచ్చే బిల్లులు మొత్తం నిలిపేసే వారు. బిల్లులు నిలిపేస్తే వెంటనే ప్రభుత్వం వద్ద నిధులు లేవని ప్రచారం జరిగేది. సీఎఫ్ఎంఎస్ విధానం వచ్చిన తర్వాత ట్రెజరీకి వచ్చిన బిల్లులన్నీ నిధులతో సంబంధం లేకుండా ఆమోదం పొందుతున్నాయి. ట్రెజరీల్లో బిల్లులు పాస్ అయితే ఇక తమ ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఎదురు చూస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు ఇతర అన్ని వర్గాల ప్రజలకు నిరాశే మిగులుతోంది. రెండు నెలలుగా సీఎఫ్ఎంఎస్ విధానంలో వెళ్లిన అన్ని రకాల బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. పభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో జిల్లా మొత్తం మీద రూ.100 కోట్ల చెల్లింపులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. వివిధ శాఖల డీడీవోల నుంచి వచ్చిన అన్ని రకాల బిల్లులు ట్రెజరీల్లోని సీనియర్ అకౌంటెంట్లకు వస్తాయి. అక్కడి నుంచి ఎస్‌టీవో, ఏటీవో, ఏడీ ద్వారా ఇబ్రహీంపట్నంలోని సీఎఫ్ఎంఎస్ మెయిన్ సర్వర్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి ఈ-కుబేర్ ద్వారా రిజర్వు బ్యాంకుకు వెళ్లిపోతాయి. రిజర్వు బ్యాంకులోని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఖాతాల్లో నగదు నిల్వలు ఉంటే వెంటనే వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో ఆర్‌బీఐ నుంచి చెల్లింపులన్నీ నిలిచిపోయాయి. రెండు నెలలుగా జిల్లాకు సంబంధించి అన్ని రకాల బిల్లులకు చెల్లింపులు నిలిచిపోయాయి. దాదాపు రూ.100 కోట్ల విలువ చేసే బిల్లులకు చెల్లింపులు బంద్ కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల నుంచి దాదాపు వెయ్యికి పైగా బిల్లులకు చెల్లింపులు రిజర్వుబ్యాంకులో ఆగిపోయాయి. జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, మెడికల్, ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్, డైట్ చార్జీలు, ఆఫీసు ఖర్చులు, బిల్లులు పెండింగ్‌లోనే ఉండి పోయాయి. జీపీఎఫ్ అనేది ఉద్యోగులు తమ జీతాల నుంచి భవిష్యత్ అవసరాలకు దాచుకున్న మొత్తం. అలాంటి బిల్లులకు కూడా చెల్లింపులు నిలిచి పోవడంతో ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వెంటనే బిల్లులకు నగదు చెల్లించాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

'స్వర్ణరథం'పై ఆదిదంపతులు



ఆలయ మాఢవీధుల్లో కనుల పండువగా స్వర్ణ రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు స్వర్ణ రథంపై ఊరేగారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున శ్రీశైల దేవస్థానం అధికారులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు జరిపించారు. స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం రథారూఢులైన స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేశారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందు భాగం నుంచి ఆలయ నాలుగు మాఢ వీధుల్లో రథాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజన తదితర జానపద కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వర్ణరథోత్సవంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, అర్చక స్వాములు, వేదపండితులు, వివిధ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, శివసేవకులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జాం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఆయిల్‌ట్యాంకర్ బోల్తా పడటంతో సోమవారం రాత్రి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో దిగువమెట్ట సమీపంలోని ఎస్ టర్నింగ్ వద్ద ట్యాంకర్ బోల్తాపడింది. దీంతో వాహనాలు వెళ్లేందుకు మరో మార్గం లేకపోవడంతో పోలీసు అధికారులు అటు గిద్దలూరు చెక్‌పోస్టు వద్ద, ఇటు గాజులపల్లె వద్ద నిలిపేశారు. సుమారు మూడు గంటల పాటు వాహనాలు నల్లమల అడవిలో నిలిచిపోవడంతో చలికి, ఆకలి దప్పులకు ప్రయాణికులు, వాహనదారులు అల్లాడిపోయారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాత్రి ట్యాంకర్‌ను పక్కకు తీయడంతో పాటు ఫైర్ ఇంజిన్‌ను తీసుకెళ్లి రోడ్డుపై పడిన ఆయిల్‌ను శుభ్రం చేయించడంతో 11.30 గంటల ప్రాంతంలో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారికి సమస్యలు వివరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నంద్యాల: అర్హులందరికీ భూ సేకరణ పరిహారం చెల్లించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కలెక్టర్ రాజకుమారిని కోరారు. పాణ్యం, గడివేముల రైతులతో కలిసి సోమవారం ఆయన కలెక్టర్‌ను కలిశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా నష్టపరిహార జాబితాలో రైతుల పేర్లు చేర్చడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే వారికి పరిహారం అందించామన్నారు. మిగిలిపోయిన కొందరికి అందించడంలో అధికారులు ప్రస్తుతం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సోలార్ కంపెనీకి పొలాలు ఇచ్చిన వారికి ఇంకా పరిహారం అందలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సద్దల సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా భూమి పొజిషన్‌లో, సాగులో ఉన్న రైతులకు భూసేకరణ పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ పిన్నాపురం సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ సత్యాలు, నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

అవసానదశలో అష్టకష్టాలు

విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్‌తోనే సరిపెడుతున్న ప్రభుత్వం

- ఎర్న్‌లీవ్‌ల పేమెంట్ కోసం పండుటాకుల ఎదురు చూపులు
- జీపీఎఫ్ ఇస్తే ఒట్టు... మట్టి ఖర్చులకూ దిక్కులేదు
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు
- నేడు పెన్షనర్ల దినోత్సవం

కూటమి ప్రభుత్వం తీరుతో విశ్రాంత ఉద్యోగులు అవసాన దశలో అష్టకష్టాలు పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 40 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి పెన్షనర్లకు పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ ఎంతమేర పెంచాలనే దానిని పే రివిజన్ కమిషన్ ప్రభుత్వానికి రెకమెండ్ చేస్తుంది. ఈ కమిషన్ ఏర్పాటు పూర్తిగా మరుగున పడిపోయింది. ప్రస్తుతం పెన్షనర్లు దుర దృష్టవశాత్తూ మరణిస్తే మట్టి ఖర్చులు కూడా అందని పరిస్థితి ఏర్పడింది. విశ్రాంత ఉద్యోగులు చాలీచాలని పెన్షన్, అనారోగ్య సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్నా కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నేడు (మంగళవారం) పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(అగ్రికల్చర్)



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెన్షనర్లకు ఒక్క ఆర్థిక ప్రయోజనం కూడా చేకూరలేదు. నెల నెలా పెన్షన్ ఇస్తున్నాం కదా.. మిగిలిన ప్రయోజనాలు ఇవ్వడం ఎందుకు అనే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు డీఏలు పెండింగ్‌లో ఉండిపోయాయి. పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వ పాలకులను అడిగే వారే లేరు. జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) చెల్లింపులు లేవు. నాలుగైదు నెలలుగా జీపీఎఫ్ పెండింగ్‌లో ఉండటంతో విశ్రాంత ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. విశ్రాంత ఉద్యోగుల ఎర్న్‌లీవ్‌ల పేమెంట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. జిల్లాలో వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు ఎర్న్ లీవ్‌ల పేమెంట్ల కోసం ఎదురు చూస్తున్నారు. నెలల డీఎస్ఎస్ రిలీఫ్ కూడా పెండింగ్‌లోనే ఉంది.

కమిషన్ ఏర్పాటు చేసి.. సిఫార్సుల అమలు మరిచి..

2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షనర్ల కోసం పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేశారు. మార్కెట్ ధరలను అధ్యయనం చేసి, విశ్రాంత ఉద్యోగ సంఘాల నేతలతో సుదీర్ఘంగా చర్చించిన అప్పటి కమిషన్ సిఫార్సులను చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోకుండా పక్కన పెట్టేశారు. అదే సిఫార్సులను 2020లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి తన ఉదారతను చాటుకున్నారు. తాజాగా పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. మెడికల్ రీయింబర్‌సమెంట్‌కు కూడా పెన్షనర్లు నోచుకోవడం లేదు. పెన్షనర్లు మరణిస్తే మట్టి ఖర్చులకు 24 గంటల్లో ట్రెజరీ అధికారులు రూ.20 వేలు చెల్లించేవారు. ఐదారు నెలలుగా మట్టి ఖర్చులకు ఇచ్చే ఆర్థిక సాయానికి కూడా నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

నేడు పెన్షనర్ల దినోత్సవం

ఏటా డిసెంబరు 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ చెల్లించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని 1981 ప్రాంతంలో ఉత్తరాదికి చెందిన ఐఏఎస్ అధికారి డీఎస్ నకరా సుప్రీం కోర్టులో కేసు వేశారు. దీనిపై 1982లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ పదవీ విరమణ ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించే విధంగా ఇచ్చిన తీర్పు వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. తీర్పు ఇచ్చిన రోజును పెన్షనర్ల దినోత్సవంగా 1983 నుంచి నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘాలు వృద్ధులకు క్యారమ్స్, చెస్ తదితర ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

పెన్షనర్లను ఆదుకోవాలి



పెన్షనర్లకు పెన్షన్ మినహా ఇతరత్రా ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు. ఐదేళ్లకోసారి పెన్షనర్ల కోసం పే రివిజన్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఇంకా వేయలేదు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 300 రోజుల ఎర్న్ లీవ్‌లకు పేమెంట్ , జనరల్ ప్రావిడెంట్ ఫండ్, డీఏలు వెంటనే చెల్లించాలి. కర్నూలు పెన్షనర్ల సంఘంలో 1,200 మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 75 ఏళ్ల పూర్తి చేసుకున్న వారిని సత్కరిస్తాం.

– ఎస్.రంగారెడ్డి, అధ్యక్షుడు, ఏపీజీఆర్ఈఏ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి



కేటీ శ్రీనివాసులు (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామ శివారులో ఉన్న వంక వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుగ్గలి మండలం రాంకొండ వీఆర్వో కేటీ శ్రీనివాసులు(37)దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే పగిడిరాయి గ్రామానికి చెందిన కేటీ శ్రీనివాసులు రాంకొండ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. పత్తికొండ నుంచి గుంతకల్లుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా బురుజుల గ్రామం వద్ద అదుపు తప్పి పక్కన ఉన్న గుంతలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రయాణికులు, గ్రామస్తులు అతని జేబులో ఉన్న గుర్తింపుకార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య కళావతి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య



మృతిచెందిన అరుణకుమారి

బనగానపల్లె రూరల్: కడుపు నొప్పి భరించలేక మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎ.అరుణ కుమారి(25) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. జిల్లెల్ల గ్రామానికి చెందిన అరుణకుమారిని రామతీర్థం గ్రామానికి చెందిన అల్వకొండ ప్రసాద్‌కు ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. అరుణకుమారి కొంతకాలంగా కడపు నొప్పితో బాధ పడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు తల్లి సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఐదేళ్ల కూతురు ఉంది.

కుక్కలదాడిలో పొట్టేళ్లు మృతి

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో కుక్కలదాడిలో రైతు దేవిరెడ్డి తిమ్మారెడ్డికి చెందిన 9 పొటేళ్లు మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామ శివారులోని పొలంలో కంచె ఏర్పాటు చేసుకుని పొట్టేళ్లు పెంచుతున్నాడు. ఆదివారం రాత్రి పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో 9 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. వెటర్నరీ అసిస్టెంట్ బజారి గ్రామానికి చేరుకుని మృతిచెందిన పొట్టేళ్లను పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పడిపోయిన ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు మరింత పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం కర్నూలు మార్కెట్‌కు 1,324 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ఈ నెల 14న ఉల్లికి కనిష్టంగా రూ.801, గరిష్టంగా రూ.3609 లభించింది. సగటు ధర రూ.2,229 మాత్రమే నమోదైంది. ఈనెల 16న ఉల్లి ధరలు మరింత తగ్గిపోవడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. కనిష్ట ధర రూ.615, గరిష్ట ధర రూ.3,149 లభించింది. సగటు ధర రూ.2,255గా నమోదైంది. శనివారం నాటితో పోలిస్తే క్వింటాల్‌పై రూ.460 పడిపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల కర్నూలు మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నష్టపరుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్రెడిట్ కార్డు ద్వారా నగదు స్వాహా

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



దివ్యాంగురాలి నుంచి వినతిపత్రం స్వీకరించి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు అమౌంట్ పెంచుతామని ఫోన్ చేసి ఆర్‌బీఎల్ క్రెడిట్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని నమ్మించి కార్డు వివరాలను ఎంటర్ చేయించుకుని గుర్తు తెలియని వ్యక్తులు మోసానికి పాల్పడ్డారని, క్రెడిట్ కార్డు నుంచి రూ.80 వేలు స్వాహా చేసినట్లు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుదేపల్లె సురేష్ ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 93 ఫిర్యాదులు అందాయి. చట్ట పరిధిలో విచారణ జరిపి న్యాయం చేస్తానని బాధితులకు ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- హైదరాబాదు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి పందిపాడు గ్రామానికి చెందిన సాయికిరణ్ రూ.3.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని, విచారణ జరిపి తన డబ్బు వాపసు ఇప్పించాలని పసుపల గ్రామానికి చెందిన సాయి చరణ్ ఫిర్యాదు చేశాడు.
- బెంగళూరు ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి చరణ్ రెడ్డి పేరుతో ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమై రూ.40 వేలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వడ్డెగేరికి చెందిన ఆసిఫ్ బాషా ఫిర్యాదు చేశాడు.
- ఆస్తి పంపకాలు చేయకుండా కుమారుడు లోకేష్ శర్మ కుటుంబ సభ్యులందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు గీతాంజలి హోమ్స్‌లో నివాసముంటున్న గోవిందమ్మ ఫిర్యాదు చేశారు.
- కొందరు తన ఆవులు, మేకలు, గొర్రెలను తీసుకెళ్లారని, విచారణ జరిపించి న్యాయం చేయాల్సిందిగా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన బోయ బండ్లక్క ఫిర్యాదు చేశారు.
- తనకు చెందిన వరి పంటను కొందరు గిట్టనివారు ధ్వంసం చేశారని, సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కర్నూలు మండలం సి.బెంగవరం గ్రామానికి చెందిన లోకేష్ గౌడు ఫిర్యాదు చేశారు.
- గుడిసెను ఆక్రమించుకోవాలని బిడ్డను, తనను నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని జొహరాపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- సత్యసాయి జిల్లా అద్దానపల్లెకు సీడు పత్తి పనికి 30 మంది వలస కూలీలు వెళ్లామని, అక్కడ పని చేయించుకుని డబ్బు ఇవ్వకుండా యజమాని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా గోనెగండ్ల మండలం పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన రవి ఫిర్యాదు చేశాడు.

తల్లీకూతుళ్లను కాపాడిన పోలీసులు

ఆత్మకూరు: భర్తతో గొడవపడి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన మహిళతోపాటు వారి ఇద్దరు కూళ్లను పోలీసులు కాపాడారు. సీఐ రాము తెలిపిన వివరాలు.. మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు మేరీ, ఈశ్వర్ గొడవపడ్డారు. దీంతో ఇద్దరు కూతుళ్లు రేణుక, నవీనలను తీసుకుని మేరీ తన పుట్టినిల్లు ఎస్ఎస్ తండాకు వెళ్లింది. అక్కడికెళ్లిన తర్వాత కూడా ఫోన్‌లో భార్యాభర్తలు మరోసారి గొడవపడ్డారు. మనస్తాపానికి గురై మేరి పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ కట్ చేసి ఇంట్లో నుంచి బయలుదేరింది. ఆందోళనకు గురైన భర్త ఈశ్వర్ ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించాడు. వారు స్పందించి ఫోన్ లొకేషన్ ఆధారంగా శ్రీశైలంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లి తల్లీకూతుళ్లను స్టేషన్‌కు తీసుకొచ్చారు. భార్యాభర్తకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. క్షణికావేశంలో జీవితాలు నాశనం చేసుకోరాదని, సమస్యలు అందరికీ ఇంటాయని, సర్దుకుపోయిచ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు.

కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఆరుగురికి గాయాలు



సుదేష్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నందవరం: కూలీల ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. సోమవారం నందవరం ఎస్సీ కాలనీకి చెందిన 10 మంది కూలీలు ప్రభుదాసు ఆటోలో వ్యవసాయ పనులు నిమిత్తం పూలచింతకు బయలుదేరారు. అదే సమయంలో నాగలదిన్నెలోని తుంగభద్ర నది నుంచి ఇసుకను నింపుకుని ట్రాక్టర్ ఎమ్మిగనూరుకు ట్రాక్టర్ బయలుదేరింది. నాగలదిన్నె– నందవరం గ్రామాల ప్రధాన రహదారిలోని నాగర్జున వేర్‌హౌస్ వద్ద కూలీల ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ఉన్న కూలీలలో సుదేష్ తీవ్రంగా గాయపడగా రాజు, రాజేష్, యేసన్న, దినకర్, పిడప్ప స్వల్పంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను స్థానికులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుదేష్‌ను డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

19 నుంచి గుడ్ గవర్నెన్స్ వీక్

కర్నూలు(సెంట్రల్): ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే గుడ్ గవర్నెన్స్ వీక్(సుపరిపాలన వారం)ను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో దేశమంతటా గుడ్ గవర్నెన్స్ వీక్ ప్రచార కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమాన్ని జిల్లా, డివిజన్, మండలస్థాయిల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా 23న సుపరిపాలన ప్రాక్టిసెస్–ఇన్నియేటివ్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, సీపీఓ కార్యాలయ ఏడీ భారతి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

- 1,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని భవనాసివంక అటవీ ప్రాంతంలో ఉన్న నాటుసారా స్థావరంపై దాడులు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ సోమవారం తెలిపారు. నాటుసారాకు ఉపయోగించే 1,300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేశామన్నారు. నాటుసారా తయారీ చేసినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై 9440902585, 9177299067, 8328307774 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

షరతులు లేకుండా రుణం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీ రజకవృత్తిదారుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): పీఎం విశ్వకర్మ కౌలస్య యోజన పథకం లబ్ధిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకుల నుంచి రూ.లక్ష రుణం ఇప్పించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ కౌసల్య యోజనపథకం లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో ధోబీ వృత్తికి ఆన్‌లైన్‌లో పలువురు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇటీవల వారికి స్కిల్‌డెవలప్‌మెంట్ కింద ఐదు రోజులపాటు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణ కాలానికి రోజుకు రూ.500 ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని, మరోవైపు రుణం కోసం బ్యాంకులకు వెళ్తే పూచీకత్తు అడుగుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పూచీకత్తు లేకుండా రుణం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుల శ్రీనివాసులు, శేషాద్రి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



కర్రసాము పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో జరిగిన జాతీయ స్థాయి కర్రసాము చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాలకు చెందిన క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ చాటినట్లు తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల సెక్రటరీ అబ్దుల్ మజీద్ పేర్కొన్నారు. సోమవారం క్రీడాకారులను అభినందించారు. 14 బంగారు పతకాలు, ఆరు రజత, నాలుగు కాంస్య పతకాలతో విజయకేతనం ఎగురవేసి ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్స్ మీట్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ మంగళవారం నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. స్పోర్ట్స్ మీట్ వాల్‌పోస్టర్లను ఆయన సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే క్రీడాపోటీలకు కర్నూలు, నంద్యాల జిల్లాలలోని 12 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 470 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కత్రో తదితర క్రీడాంశాల్లో బాలబాలికల విభాగాలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శిరివెళ్ల: మండల పరిధిలోని గంగవరానికి చెందిన చాకలి నరసింహ (37) సోమవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలు.. రైతు సుబ్బరాయునికి చెందిన పొలం గట్టున ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్‌ను గమనించకుండా నరసింహ కాలినడకన వెళ్తూ తొక్కాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయకూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహ మృతితో.. ఆ కుటుంబంలో విషాదలో మునిగిపోయింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కోలుకోలేక కౌలు రైతు మృతి



విజయ్ (ఫైల్)

గోనెగండ్ల: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన ఈడిగా ఉరుకుంద, సుజాత దంపతులు చిన్న కుమారుడు విజయ్(20) రెండేళ్లుగా 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పొలం సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది కొత్తిమీర, ఉల్లి, మిరప సాగుచేశాడు. పెట్టుబడుల నిమిత్తం తెలిసిన వారి వద్ద రూ.4 లక్షలు అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పు తీర్చే మార్గంలేక గత గురువారం పొలంలోనే పురుగు మందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా సోదరుడు వినోద్ గౌడ్ గమనించి చికిత్స నిమిత్తం కోడుమూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆర్‌యూ వలంటీర్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకానికి (ఎన్ఎస్ఎస్) చెందిన వలంటీర్ ఏకే హర్షవర్దన్ జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం వర్సిటీలో ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు వలంటీర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు హర్షవర్దన్ ఎంపిక కావడం వర్సిటీతో పాటు జిల్లాకు గర్వకారణమన్నారు. నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ (సుంకేసుల రోడ్డు)లో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న హర్షవర్దన్ నవంబర్ 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో నిర్వహించిన ప్రీ పరేడ్ క్యాంపులో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైనట్లుగా పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన హర్షవర్దన్ ఢిల్లీ చేరుకుని అక్కడ వివిధ అంశాల్లో శిక్షణ పొందుతాడని వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్ హర్షవర్దన్‌ను అభినందిస్తున్న ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

'పొగ'బారిన ఆశలు

- కంపెనీలు ప్రకటించిన ధర క్వింటాల్ రూ.15,500
- గిట్టుబాటు కాదంటున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం



పొగాకు ఆరబెట్టిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది పొగాకు భారీ ఎత్తున సాగు అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు దాదాపు 45 వేల ఎకరాల్లో సాగు అయింది. గత ఏడాదితో పోలిస్తే పొగాకు సాగులో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. కాని ధరలో మాత్రం నామమాత్రంగా పెరుగుదల ఉండటం పట్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాది పొగాకుకు కంపెనీలు నిర్ణయించిన ధర రూ.15000. ఈ ఏడాది క్వింటాలు పొగాకుకు కనీసం రూ.18000 ధర నిర్ణయిస్తే గిట్టుబాటు అవుతుందనే ఉద్దేశ్యంతో రైతులు ఉన్నారు. అయితే రైతుల ఆశాలను పొగాకు కంపెనీలు నీరు కార్చాయి. ఇటీవల గుంటూరులో సమావేశమైన పొగాకు కంపెనీల అసోషియేషన్ ప్రతినిధులు పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ధరను నిర్ణయించడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పొగాకు ధరను కంపెనీల అసోషియేషన్ క్వింటాలుకు రూ.15500 మాత్రమే నిర్ణయించింది. గత ఏడాదితో పోలిస్తే క్వింటాలుపై కేవలం రూ.500, కిలోపై రూ.5 మాత్రమే పెంచింది. అన్నదాతలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. పొగాకు ధరల నిర్ణయాన్ని ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం వల్ల పొగాకు కంపెనీలు ఏకపక్షంగా ధరను నిర్ణయించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ పాలకులు చొరవ తీసుకొని ఉంటే రైతులకు కొంత వరకు న్యాయం జరిగేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పెరిగిన పెట్టుబడి వ్యయం

గత ఏడాది పొగాకు సాగులో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. గత ఏడాది పెట్టుబడి వ్యయం రూ.60 వేల వరకు ఉంది. ఈ ఏడాది రసాయన ఎరువుల ధరలు పెరిగిపోయాయి. అదే విధంగా ట్రాక్టరు బాడుగలు పెరిగాయి. ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడి వ్యయం పెరిగింది. కుటుంబ సభ్యులందరు రేయింబవళ్లు పొలంలోనే పనులు చేస్తుంటారు. కానీ ధర మాత్రం క్వింటాలుకు రూ.500 మాత్రమే పెంచడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్వింటాలుకు ప్రకటించిన రూ.15,500 ధర అన్ని విధాలా నాణ్యతతో ఉంటేనే లభిస్తుంది. నాణ్యత లేకపోతే క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ.14,000 వరకు లభిస్తుంది. నీటివసతి ఉంటే పొగాకులో ఎకరాకు సగటున ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వర్షాధారం కింద ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల వరకు మాత్రమే వస్తుంది. పొగాకు కంపెనీలు ప్రకటించిన ధర ప్రకారం చూస్తే రైతుకు గిట్టుబాటు అయ్యేది నామమాత్రమే. క్వింటాల్‌కు రూ.18,000 ధరను ప్రకటించి ఉంటే రైతులకు ఉపశమనం లభించేది. ప్రస్తుతం రెండు, మూడు రోజులుగా కంపెనీలు పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. అయితే నిర్ణయించిన ధర రైతులకు లభించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.